సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం, 13, మే, 2025



మట్టి తీసి గట్టు మీద పెట్టు

ఉండి సబ్ డివిజన్ పరిధిలో కాలువల్లో తీసే పూడిక మట్టిని పొక్లెయిన్ సహాయంతో మళ్లీ గట్లపైనే వేసి కాంట్రాక్టర్‌లు చేతులు దులుపుకుంటున్నారు. 8లో ▸



మట్టి అక్రమ తవ్వకాలు

తాడేపల్లిగూడెం మండలంలో పలు గ్రామాల్లోని చెరువులను టార్గెట్ చేసుకుని జేసీబీల సాయంతో మట్టి తవ్వి ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తున్నారు. 8లో ▸



నాటు తుపాకులతో హల్‌చల్

ఆక్వా చెరువులపై పిట్టలు కొట్టేందుకు వేటగాళ్లు నాటు తుపాకులు విచ్చలవిడిగా వాడుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. 8లో ▸

జనసేనకు టీడీపీ షాక్!

- నామినేటెడ్ పదవుల్లో దక్కని ప్రాధాన్యత
- పశ్చిమ జిల్లా అధ్యక్షుడు చిన్నబాబుకు మరో 'సారీ'
- అసంతృప్తిలో అనుచరులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు : నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో జనసేనకు టీడీపీ షాకిచ్చింది. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పదవుల్లో కీలక ప్రాధాన్యం ఉంటుందని పదే పదే ప్రకటించి చివరికి జిల్లా స్థాయిలో కూడా చోటు కల్పించకపోవడంతో జనసేన కేడర్ తీవ్ర అసంతృప్తితో ఉంది. టీడీపీ ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవడం లేదన్న బాధలో ఉన్న వారిని తాజా నియామకాలు మరింత నిరాశకు గురిచేస్తున్నాయి.

జనసేన నుంచి నలుగురే..

జనసేన పట్టున్నట్టు చెప్పుకునే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంతవరకు రాష్ట్ర స్థాయిలో 12 మందికి నామినేటెడ్ పదవులు దక్కగా వారిలో జనసేన నుంచి కేవలం నలుగురే ఉన్నారు. జిల్లా నుంచి తొలి విడతలో ఇద్దరికి, రెండో విడతలో నలుగురుకి, తాజాగా ఏడుగురికి పదవులు దక్కాయి. మొదటి విడతలో ఏపీ వినియోగదారుల కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా నియమించిన టీడీపీ మాజీ మంత్రి పీతల సుజాతకు ఈ సారి రాష్ట్ర మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి వరించింది. మిగిలిన వారిలో ఆప్కాబ్ డీసీసీబీ చైర్మన్‌గా ఉంగుటూరు టీడీపీకి చెందిన గన్ని వీరాంజనేయులు, డీసీఎంఎస్ చైర్మన్‌గా జనసేనకు చెందిన చాంగటి మురళీకృష్ణ, భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు చైర్మన్‌గా తాడేపల్లిగూడెం టీడీపీకి చెందిన వలవల బాబ్జి, టైలర్స్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా తాడేపల్లిగూడెం టీడీపీకి చెందిన ఆకాశపు స్వామి, మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా నరసాపురం టీడీపీకి చెందిన కొల్లు పెద్దిరాజు, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఏలూరు టీడీపీ నగర అధ్యక్షుడు పెన్నుబోయిన వాణి వెంకట శివ ప్రసాద్ ఉన్నారు. మూడో విడతలోని ఏడుగురిలో ఆరుగురు టీడీపీకి చెందిన వారే ఉండటం జన సైనికులకు మింగుడు పడటం లేదు.

చినబాబుకు భంగపాటు

భీమవరం నుంచి పవన్ కల్యాణ్ పోటీ చేయకపోవడంతో ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు, భీమవరానికి చెందిన కొటికలపూడి గోవిందరావు(చినబాబు) బరిలో ఉంటారని భావించారు. అనూహ్యంగా టీడీపీ నుంచి పులపర్తి రామాంజనేయులు జనసేనలో చేరి సీటు తెచ్చుకున్నారు. కూటమి ధర్మానికి కట్టుబడి భీమవరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పార్టీ ఎమ్మెల్యేల గెలుపునకు పనిచేశారు. ఆయన సేవలకు ఎమ్మెల్సీ పదవి ఆశించారు. పదవి దక్కక ప్రభుత్వ కార్యక్రమాలకు కొంత దూరంగా ఉంటున్న తరుణంలో డీసీసీబీ చైర్మన్‌గా నియమిస్తారంటూ అధినాయకత్వం నుంచి సమాచారం వచ్చిందని రెండు నెలల క్రితం హడావుడి చేశారు. అమరావతి వెళ్లి సీఎం చంద్రబాబును కలవడంతో డీసీసీబీ చైర్మన్‌గా చినబాబు ఖాయం అంటూ వార్తలు వచ్చాయి. అదే సమయంలో చినబాబు అనుచరులు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. ఆదివారం ప్రకటించిన పదవుల్లో డీసీసీబీ చైర్మన్ రాకపోగా, ఎక్కడా ఆయనకు చోటు దక్కక అనుచరుల్లో అసంతృప్తి నెలకొంది. నియోజకవర్గంలో, ఉమ్మడి జిల్లాలో పార్టీని నెట్టుకుని వస్తే అధికారంలోకి వచ్చాక పదవులను వేరొకరు ఎంజాయ్ చేస్తున్నారని మథనపడుతున్నారు.

తీవ్ర అసంతృప్తిలో జనసేన కేడర్

గత ఎన్నికల్లో జనసేన నుంచి భీమవరం సీటు ఆశించిన వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయుడు నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆశించి భంగపడ్డారు. ఇప్పటికే భీమవరంలో పేరుకు జనసేన ఎమ్మెల్యే అయినా పెత్తనమంతా టీడీపీ నాయకుల చేతుల్లోనే ఉంది. ఆచంట, పాలకొల్లు, తణుకు, ఉండి నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవడం లేదన్న అసంతృప్తిలో జనసేన కేడర్ ఉంది. ఏలూరు నుంచి రెడ్డి అప్పలనాయుడుకు ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా రెండో విడత నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పించగా కైకలూరు, చింతలపూడి, పోలవరం తదితర నియోజకవర్గాల్లో కేడర్ తమను ద్వితీయ శ్రేణి నేతలుగానే చూస్తున్న పరిస్థితి ఉందని మండిపడుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ



భీమవరం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి పీజీఆర్ఎస్‌కు బాధితులు పోటెత్తారు. వివిధ గ్రామాలకు చెందిన వృద్ధులు, వికలాంగులతో పాటు వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 187 అర్జీలను అందచేశారు. భార్య, ఇద్దరు కుమార్తెలు తనను ఇంటి నుంచి గెంటేశారని పెంటపాడు మండలం ప్రత్తిపాడు పంచాయతీ కాగులంపాడుకు చెందిన గజ్జరపు శంకరనారాయణ ఫిర్యాదు చేశారు. తాను 90 శాతం ఆర్థోపెడిక్ సమస్యతో బాధపడుతున్నానని.. వికలాంగుల పింఛన్ సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నానని భీమవరం పట్టణం బలుసుమూడికి చెందిన రమణ కాత్యాయినిదేవి ఫిర్యాదు చేశారు. రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఉన్నతి రుణాలు మంజూరు రూ.7.75 కోట్లు లక్ష్యం కాగా, రూ.8.32 కోట్లు రుణాలను మంజూరు చేశారని.. రుణాల రికవరీ 99.91 శాతం ఉందని.. కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో డీఆర్డీఏ ఉన్నతి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ తిరుమాని మురళీకృష్ణను పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభినందించారు.

న్యూస్‌రీల్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, గ్రామాల్లో వలసలు నివారించి వ్యవసాయ కూలీలందరికీ 200 పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు, కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము కోట్లాది రూపాయలు పెండింగ్ ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని, రాజకీయ నాయకుల జోక్యాన్ని పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బందిపై కక్ష సాధింపులు, వేధింపులు నివారించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఏపీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీయూటీఎఫ్ ఆధ్వర్యంలో భీమవరంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో 1:45 నిష్పత్తి ప్రకారం బదిలీలు జరపాలన్నారు. ఏపీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలన్నింటిలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించి నాణ్యమైన విద్య అందించాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్, విద్యాశాఖాధికారికి అందించారు.

ప్రిన్సిపల్ అనుచిత ప్రవర్తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమవరం/పాలకోడేరు: ఇంటర్ చదువుతున్న తన కుమార్తెను భీమవరం పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.కృష్ణారావు మానసికంగా, శారీరకంగా వేధించాడంటూ భీమవరం రూరల్ మండలం చినఅమిరం గ్రామానికి చెందిన బాలిక తండ్రి సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఫిర్యాదు చేశారు. తన కుమార్తె ప్లస్ 2 చదువుతోందని.. ప్రిన్సిపల్ బాలికను తన చాంబర్‌కు పిలిపించుకుని అసభ్యకరంగా ప్రవర్తించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను చెప్పినట్లు వినకపోతే పరీక్షలో ఫెయిల్ చేస్తానని, చంపుతానని బెదిరించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. భయపడి ఈ విషయాలను ఎవరికీ చెప్పుకోలేక తనలో తానే బాధపడేదని.. ఎన్నిసార్లు అడిగినా ఏమీ చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల ఆ స్కూల్ మూసి వేస్తున్నట్లు, ఆ స్కూల్ యాజమాన్యంలో గొడవలు ఉన్నట్లు సమాచారం రావడంతో ధైర్యం తెచ్చుకుని తనకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పిందని.. తమ అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రిన్సిపల్ కృష్ణారావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

19న అత్తిలి ఎంపీపీ ఎన్నిక

అత్తిలి: ఈ నెల 19న అత్తిలి ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అత్తిలి మండలంలో 20 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 16 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ, 4 స్థానాల్లో కూటమి పార్టీలు గెలుపొందాయి. ఎంపీపీగా మక్కా సూర్యనారాయణ రెండున్నరేళ్లు పని చేసి ఆ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మార్చి 27న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు జరగాల్సి ఉండగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను ఓటు వేయకుండా నిర్బంధించడంతో ఎన్నిక నిలిచింది. మరుసటి రోజు ఎన్నిక జరగకుండా కూటమి నాయకులు అడ్డుపడ్డారు.

19న యలమంచిలి ఎంపీపీ ఎన్నిక

యలమంచిలి: ఈ నెల 19న యలమంచిలి ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నుంచి సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. 15న సభ్యులకు ఎన్నికల నోటీసులు అందజేసి 19న ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని ఆమె వివరించారు.

15వ రోజుకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మె



కలెక్టరేట్ సమీపంలో సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

భీమవరం: భీమవరం కలెక్టరేట్ సమీపంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది. ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు పి.శిరీష రాణి, సెక్రటరీ కె.విజయ సీతారామరాజు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, నిర్దిష్టమైన జాబ్ కార్డులు అందించాలని, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్‌ఫర్ తదితర డిమాండ్లతో గత 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

దళితుల ఇళ్లకు కరెంటు తొలగింపు అన్యాయం

కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి



కాళ్ల లంక రోడ్డులో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న కేవీపీఎస్ బృందం

కాళ్ల: ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా దళితుల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించడం అన్యాయమని, వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి హెచ్చరించారు. సోమవారం కాళ్ల మండల కేంద్రంలో లంక రోడ్డులో ఉన్న దళితుల ఇళ్లను కేవీపీఎస్ బృందం పరిశీలించి, బాధితులను పరామర్శించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ కాళ్ల మండల కేంద్రం లంక రోడ్డులో ఉన్న పది దళిత కుటుంబాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దుర్మార్గంగా కరెంటు కట్ చేయడం అన్యాయమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు చీకట్లో ఉంటూ కొవ్వొత్తుల వెలుగులో చదువుకుని పరీక్షలకు వెళ్లడం సిగ్గుచేటు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారమే దళితుల ఇళ్ళకు కరెంట్ కట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆదేశాలను పాటించాల్సి వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయతీ, ఆర్ అండ్ బీ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలతోనే కరెంట్ కట్ చేసినట్లు చెప్పారన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలక్ట్రికల్ ఏఈ, పంచాయతీ అధికారులు కుమ్మక్కై కరెంటు కట్ చేశారని తక్షణం వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులు కాబట్టే ఆధిపత్యాన్ని చూపించి అన్యాయంగా కరెంటు కట్ చేశారన్నారు. తక్షణం కరెంటు ఇవ్వకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయం చూపించే ఇళ్లు తొలగిస్తున్నామని చెపుతున్న ఎమ్మెల్యే అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో తొలగించాలనుకుంటున్న ఇళ్ళకు వచ్చి బాధితులతో మాట్లాడాలన్నారు. కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో తొలగిస్తున్న పేదల ఇళ్ళకు ప్రత్యామ్నాయం చూపుతున్నారని ఎమ్మెల్యే చెపుతున్నారని ప్రత్యామ్నాయం అంటే ఇళ్ల స్థలాలు చూపి పట్టాలు చేతికివ్వడం మాత్రమే కాదని పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూల్చిన ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకొనే వరకు అద్దె కూడా ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, సీఐటీయు జిల్లా నాయకుడు గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



మురళీ కృష్ణంరాజును సత్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తదితరులు

తాడేపల్లిగూడెం: వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని వైఎస్సార్‌సీపీ నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. పార్లమెంటులోని నియోజకవర్గాల పర్యటనలో భాగంగా సోమవారం గూడెం నియోజకవర్గ కన్వీనర్ కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. కొట్టు సత్యనారాయణ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారి పక్షాన పోరాడాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే అన్ని పథకాలు కొనసాగుతాయని, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని.. ప్రతి ఇంటికి తెలియజేయాలని సూచించారు. నియోజకవర్గ కన్వీనర్ కొట్టు సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

కాళ్ల: కాళ్లలో రెవెన్యూ రికార్డు ట్యాంపరింగ్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కాళ్ళ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కాళ్ళ గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో జరిగిన సర్వే ప్రకారం కాళ్ళ వ్యవసాయ భూముల విస్తీర్ణం సుమారు 3,862 ఎకరాలని.. రీసర్వేలోనూ వ్యవసాయ భూమి విస్తీర్ణం 3,862 ఎకరాలుగా చూపారని.. భూమిలో ఏవిధమైన మార్పు లేదన్నారు. భూములను ఆన్‌లైన్ చేసిన సందర్భంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని తహసీల్దార్ సుందర్‌సింగ్‌కు వివరించారు. అనర్హులను 1బీలో నమోదు చేయటం వల్ల అర్హులు రోడ్డున పడ్డామన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాళ్ళలో రీసర్వే జరిగి చాలా కాలం అయినా.. ఆ వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించకుండా గోప్యత ఎందుకు పాటిస్తున్నారు అని ప్రశ్నించారు. ఒక్కొక్క రైతుకు ఎకరాకు 2 సెంట్ల నుంచి 40 సెంట్లు భూమి వ్యత్యాసం చూపిస్తున్నారని వాపోయారు.

నేత్ర పర్వం.. రథోత్సవం



క్షేత్రంలో వైభవంగా శ్రీవారి రథయాత్ర



రాజమన్నార్ అలంకారంలో శ్రీవారు



రథంలో కొలువైన స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో జరుగుతున్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామికి జరిగిన రథోత్సవం నేత్రపర్వమైంది. చినవెంకన్న తిరుకల్యాణ మహోత్సవం జరిగిన మరుసటి రోజు రాత్రి రథోత్సవం జరపడం సంప్రదాయంగా వస్తోంది. అధిక సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి, పూజాదికాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట భజనలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణల నడుమ వాహనాన్ని రథం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేసి, హారతులిచ్చారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తదితరులు రథం వద్ద పూజలు నిర్వహించి, బలిహరణను సమర్పించగా, రథోత్సవం ప్రారంభమైంది. డప్పు వాద్యాలు, కళాకారుల వేషధారణలు, కోలాట భజనలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి దివ్య రథం క్షేత్ర పురవీధుల్లో తిరుగాడింది. ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక అలంకరణలో భాగంగా స్వామివారు రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు :

- ఉదయం 7గంటల నుంచి-భజన కార్యక్రమాలు
- 8 గంటల నుంచి – భక్తిరంజని
- 9 గంటల నుంచి-కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- 10.30 గంటల నుంచి-చక్రవారి-అవభృథోత్సవం
- మధ్యాహ్నం 3 గంటల నుంచి – వేద సభ
- సాయంత్రం 4 గంటల నుంచి-నాదస్వర కచేరీ
- 5 గంటల నుంచి – సంగీత విభావరి
- రాత్రి 7 గంటల నుంచి-కూచిపూడి నృత్య ప్రదర్శన
- 8 గంటల నుంచి – పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ
- 9 గంటల నుంచి-అశ్వవాహనంపై గ్రామోత్సవం
- శ్రీవారి ప్రత్యేక అలంకారం – కాళీయమర్దనం

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భీమవరం: ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలో భాగంగా జీవో నెంబర్ 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలో మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కారణంగా యూనివర్సిటీలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయని.. ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలను బాగుచేయాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఆయా యూనివర్సిటీ నిర్వహించేలా చూడాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాల్సి ఉండగా తూతూ మంత్రంగా రూ.788 కోట్లు ప్రభుత్వం విడుదల చేసి చేతులు దులుపుకుందని ఆక్షేపించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అర్జీలు పునరావృతం గాకుండా నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 19 ఫిర్యాదులు అందాయి. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సదరన్ క్యాంపుల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి

భీమవరం(ప్రకాశంచౌక్): దివ్యాంగుల పెన్షన్లు పొందుతున్న వారికి నిర్వహిస్తున్న సదరన్ క్యాంపుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో రీ వెరిఫికేషన్ సదరన్ క్యాంపుల నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.6 వేలు, రూ.15 వేలు పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు మొత్తం 27,500 మంది ఉన్నారని, వారిలో 9 వేల మందికి రీ వెరిఫికేషన్ పూర్తయిందన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 93 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు 93 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్షాకేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా జనరల్ కేటగిరిలో 316 మందికి 289 మంది, ఒకేషనల్ కేటగిరిలో 51 మందికి 35 మంది హాజరయ్యారన్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో యువకుడి హత్య


అరవింద్ మృతదేహం

కాళ్ల: మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో యువకుడు హత్యకు గురైన ఘటన కాళ్ల మండలం ఎల్ఎన్ పురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా కోమటిలంకకు చెందిన చెన్నకేశవ అరవింద్(22), ప్రత్తికోళ్లలంక కు చెందిన బండి జాన్ యేసు ఇద్దరూ బంధువులు. కొంతకాలం క్రితం కాళ్ళ మండలం ఎల్ఎన్ పురం గ్రామంలోని చెరువుల వద్దకు జీవనోపాధి నిమిత్తం వచ్చారు. వీరు పనిచేసే చెరువుల వద్ద కిరణ్ అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి వీరు ముగ్గురు పనిచేస్తున్న చెరువుపై మద్యం సేవించారు. మద్యం మత్తులో బంధువులైన జాన్ యేసు, అరవింద్ ఘర్షణకు దిగారు. అనంతరం జరిగిన దాడిలో జాన్ యేసు మేతబస్తాలపై ఉన్న చాకుతో అరవింద్ ఛాతీపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన అరవింద్‌ని పక్కనే ఉన్న కిరణ్ వేరే వ్యక్తి సహాయంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు అరవింద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేయగా సీఐ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

తాడేపల్లిగూడెం అర్బన్ : ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన ఘటన తాడేపల్లిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిర్రా నాగేశ్వరరావు మున్సిపాల్టీలో కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి 16 ఏళ్ల క్రితం రామతులసీతో వివాహం కాగా కొన్నాళ్ల క్రితం విడిపోయారు. అనంతరం రామతులసీ బాదంపూడి డేవిడ్ అనే వ్యక్తిని మరో వివాహం చేసుకొంది. రెండో పెళ్లి చేసుకుందనే అక్కసుతో రామతులసీపై సిర్రా నాగేశ్వరరావు లేనిపోని మాటలను ప్రచారం చేస్తున్నాడని బాదంపూడి డేవిడ్ కొన్ని రోజుల క్రితం గొడవ పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి నాగేశ్వరరావును స్థానిక మసీదు సెంటరులోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలు వద్ద చూసిన డేవిడ్ కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటనలో సిర్రా నాగేశ్వరరావుకు మెడపై గాయాలు కాగా అతడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా కంకర తరలింపు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని మెట్టప్రాంతంలో మట్టి, కంకర మాఫియా ముఠా పడగ విప్పింది. రెండు రోజులనుంచి వందలాది లారీలతో యథేచ్ఛగా కంకరను లంబాడీ గూడెం నుంచి పెంటపాడు మండలం అలంపురంనకు తరలిస్తున్నారు. అలాగే బాదంపూడికి చెందిన కూటమి నాయకుడు పోలవరం కాలవగట్టు కంసాలిగుంట నుంచి పోలవరం కాలవగట్టు తవ్వి కంకరను తరలిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గొల్లగూడెం ప్రాంతంలో కుడిగట్టు కంకర గుట్టలు, నాచుగుంట ఆయకట్టులో మట్టి తరలింపు పనులు జరుగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా ఇవన్నీ జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై తహసీల్దార్ రవికుమార్‌ను ప్రశ్నించగా కంకర తరలింపు పనులు నిలుపుదల చేసినట్లు తెలియజేశారు.

మట్టి తీసి గట్టు మీద పెట్టు

- తూతూమంత్రంగా కాలువల ఆధునికీకరణ?
- కాలువలో మట్టి తీసి వేరే ప్రాంతానికి తరలించకుండా గట్టుపైనే వేస్తున్న వైనం

ఉండి: ఉండి సబ్ డివిజన్ పరిధిలో కొత్తగా ఏడు కాలువల పూడికతీత పనులు, గత ప్రభుత్వంలో మంజూరైన రెండు పనులు చేపట్టేందుకు ఇటీవల హడావిడిగా అధికారులు సమాయత్తమయ్యారు. పనులు చేసే విధానం చూస్తుంటే రైతులకు మేలు జరగటం పొరపాటే అని అర్థం అవుతుంది. కాలువల్లో పూడిక తీసి ఆ మట్టిని వేరే ప్రాంతానికి తరలిస్తే కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డులేకుండా ఉంటుంది. కానీ కాలువల్లో తీసే పూడిక మట్టిని పొక్లెయినర్ సహాయంతో గట్లపైనే వేసి కాంట్రాక్టర్‌లు చేతులు దులుపుకుంటున్నారు. కాలువల్లో నీరు ఉన్నాగాని పొక్లెయినర్‌ల సహాయంతో వారికి నచ్చిన ప్రాంతంలో మట్టిని తీసి గట్లపై వేసి పూడిక తీసేసినట్లు మసిపూసి మారేడు కాయచేస్తున్నారు. అంతే కాకుండా చాలా పని చేసేసినట్లు గట్లపైనా, కాలువ అంచున ఉండే గడ్డిని పొక్లెయినర్ సహాయంతో తొలగించి ఆ ప్రాంతంలో పూడికను చాలా బాగా తొలగించినట్లు చెప్పడం విశేషం. అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో కాలువగట్ల వెంబడి ఉండే సీసీరోడ్లపైనా పూడిక తీసిన మట్టిని వేసి సీసీరోడ్లను మట్టిరోడ్లుగా మార్చేస్తున్న విధానంపై స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇదేంటి అని అడిగితే దానికి సమాధానం చెప్పేవారు లేరంటే పనులు జరుగుతున్న తీరు అర్థం చేసుకోవచ్చు. కాలువల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించేందుకు అధికారులు కూడా కంటికి కనిపించడం లేదంటే.. పనులు ఎవరికి లాభం చేకూరుస్తున్నాయో తెలుస్తోంది.

ఉండి సబ్ డివిజన్‌లో మొత్తం 9 పనులు మంజూరు

ఉండి ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో మొత్తం 9 పూడికతీత పనులు ఈ వేసవిలో ప్రారంభిస్తున్నారు.


ఉండి శివారు కలిసిపూడిలో కాలువ పూడికతీత పనుల్లో మట్టి తీసి గట్లపైనే వేసిన దృశ్యం


కలిసిపూడిలో కాలువలో నీరుండగానే గట్లను శుభ్రం చేసి చేతులు దులుపుకున్న అధికారులు

వీటిలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.94 లక్షలతో ఏడు పనులు, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన రెండు పనులు రూ.12.16 లక్షల అంచనాలతో పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వీటిలో మొదటిగా ఉండి మండలం కలిసిపూడి రెగ్యులేటర్ నుంచి శివారు ప్రాంతం అజ్జమూరు సరిహద్దు వరకు రూ.33 లక్షల అంచనాలు కాగా అగ్రిమెంట్ రూ.22 లక్షలు (వీటిలో లష్కర్ జీతాలు కూడా ఉంటాయని అధికారులు తెలిపారు)గా పనిని ప్రారంభించారు. వాంద్రం కాలువ రూ.7.06 లక్షల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. మిగిలినవి యండగండి సెక్షన్‌లో లోసరి మెయిన్ కాలువ, బాపనకోడు, యండగండి అప్పర్‌పేర్లల్ కాలువ, చిలకంపాడు సెక్షన్‌లో రావిపాడు కాలువ, వీఎండబ్ల్యూ కాలువ పరిమెళ్ళ లాకుల వద్ద లీడింగ్ కాలువ పూడిక తీత పనులు రూ.62 లక్షలతో చేపట్టాల్సిన ఐదు పనులు రెండు లేదా మూడు రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. అలాగే గత ప్రభుత్వంలో రూ.12.16 లక్షల అంచనాలతో మంజూరైన అర్తమూరు, పాములపర్రు కాలువ, జక్కరం బొర్రకోడుల పనులు చేపట్టాల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రారంభించిన రెండు పనుల్లో ఇంతటి దారుణం జరుతుంటే చేపట్టాల్సిన మొత్తం ఏడు పనుల్లోను ఎంతటి దారుణాలు చోటుచేసుకుంటాయో అని రైతులు వాపోతున్నారు.

పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి

కలిసిపూడి, వాంద్రం కెనాల్ పూడిక తీత పనులు పారదర్శకంగా జరుతున్నాయి. అనుకున్న విధంగానే పనులు చేపట్టి పూర్తి చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో నీరు ఉండడం వల్ల రెండు లేదా మూడు రోజుల్లో మిగిలిన పనులు ప్రారంభిస్తాము.

– డీఈ పీఎస్‌వీవీఎస్ మూర్తి, ఉండి

నాటు తుపాకులతో వేటగాళ్ల హల్‌చల్

- విచ్చలవిడిగా ఆక్వా చెరువులపై నాటు తుపాకుల వినియోగం
- పట్టించుకోని అధికారులు

ఉండి: నాటుతుపాకులతో వేటగాళ్లు హల్‌చల్ చేస్తున్నారు. ప్రతిరోజు ఆక్వా చెరువులపై పిట్టలు కొట్టేందుకు తుపాకులను విచ్చలవిడిగా వాడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి, అర్తమూరు తదితర గ్రామాలతోపాటు ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు, భీమవరం రూరల్ మండలాలు, ఏలూరు జిల్లాలోని గణపవరం, నిడమర్రు మండలాల్లోను ఇదే విధంగా నాటు తుపాకులు దర్శనమిస్తున్నాయి. పట్టపగలే వాహనాలపై తుపాకులను చేతపట్టుకుని తిరుగుతున్నా పోలీసులు గానీ, ఇతర అధికారులు గానీ ఎవరూ పట్టించుకోడం లేదంటూ సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. తుపాకీ గురితప్పితే తమ పరిస్థితి ఏంటని ఆయా మండలాల్లోని ప్రజలు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు.

ఇది నేరం కాదా?

నాటు తుపాకీలతో కేవలం పిట్టలనే కాలుస్తున్నారా.. లేక మరేదైనా జరుగుతుందా.. తుపాకుల సరఫరా ఎక్కడ నుంచి జరుగుతుంది అంటూ పలువురు వీటిపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా ఈ నాటు తుపాకులతో ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల నుంచి వేటగాళ్లు ఇంత బహిరంగంగా ఎలా వస్తున్నారు? వారికి రూ.30 వేలు నుంచి రూ.40 వేలు జీతాలు ఎలా ఇస్తున్నారు?ఇదేమీ నేరం కాదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

గతంలో నాటుతుపాకీతో దారుణాలు

గతంలో నాటుతుపాకీతో జరిగిన దారుణాలు గుర్తు తెచ్చుకుని ప్రజలు భయపడుతున్నారు. గతంలో సరిగ్గా పంచాయతీ ఎన్నికల సమయంలో మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో నాటుతుపాకీతో ఓ హత్య జరగడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అప్పుడు కూడా ఆక్వా చెరువులపై పిట్టలు కొట్టేందుకు తెచ్చిన నాటుతుపాకీగా పోలీసులు గుర్తించినట్లు పలువురు చెబుతున్నారు. అలాగే చెరువుకువాడ గ్రామంలో నాటు తుపాకీతో ఓ వ్యక్తి కోతి(వానరం)ని కాల్చడం కూడా సంచలనానికి దారి తీసింది. ఇంతటి భయంకరమైన ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టంచుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వెంటనే వీటిపై చర్యలు తీసుకుని ప్రజల ప్రశాంత జీవనానికి అండగా నిలవాలని వారు కోరుతున్నారు.



ఉండి శివారు అర్తమూరు పరిధిలో నాటు తుపాకులతో వేటగాళ్లు

కోకో రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి


ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని, ఇప్పటివరకు కొనుగోలు చేసిన కోకో గింజలకు కూడా వ్యత్యాసపు ధర చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. మోండలీజ్ కంపెనీ ప్రతినిధులు రైతులను అవమానపరచడాన్ని నిరసిస్తూ, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు సోమవరప్పాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న మోండలీజ్ కంపెనీ కార్యాలయం, గోడౌను వద్ద కోకో రైతుల ధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఏలూరు అన్నే భవనంలో సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించకుండా కంపెనీలు కోకో రైతులను నిలువు దోపిడీ చేయడం దారుణమని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, కంపెనీలు చర్యలు చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్. గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ల వెంకట సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర నాయకులు కోనేరు సతీష్ బాబు, ఏబీఎస్ ప్రకాశరావు, యలమాటి విశ్వేశ్వరరావు, ఏ.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్ : పట్టణంలోని చతుర్భుజ లక్ష్మీ తాయార్లు సమేత శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారి (చినగోపురం) బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం 6 గంటలకు విశాఖ జిల్లా పెందుర్తి వాస్తవ్యులు, కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధానార్చకులు ముప్పిరాల అనంతాచార్యస్వామి, వారి శిష్య బృందంచే విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనము, రక్షాబంధనం, ఋత్విగరుణము, మృత్సంగ్రహణము, అంకురార్పణ, కుంబావాహన, నివేదన, మంగళాశాసనము, తీర్థప్రసాద వినియోగముతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బిరుదుకోట శంకర్ తెలిపారు.

దేశంలోనే రెండో క్షేత్రం

స్వామివారు అష్టబాహువులతో దేశంలో మొత్తం రెండు ప్రాంతాల్లో మాత్రమే కొలువై ఉన్నారని.. ఒకటి కంచి, రెండవది పాలకొల్లులో మాత్రమేనని స్థల పురాణాలు చెబుతున్నాయి. ఆలయంలో మూలవిరాట్ స్వామివారికి కుడివైపున లక్ష్మీతాయారు, ఎడమ భాగంలో ఆండాళ్లవారి ఉపాలయాలు, వెనుక భాగంలో ఆళ్వార్లు ఉపాలయాలు ఉన్నాయి. ఆలయంలో స్వామివారికి ఎడమ వైపు భాగంలో శ్రీరామక్రతువు స్తూపం, ఆగ్నేయంలో స్వామివారి హోమ మండపం, ఉత్తర భాగంలో స్వామివారి కళ్యాణోత్సవ మండపాలు ఉన్నాయి. అలాగే స్వామివారికి స్థానిక బంగారువారి చెరువుగట్టున తోటోత్సవం నిర్వహించే మండపం ఉంది.


కొలువైన లక్ష్మీనారాయణ స్వామి


అష్టభుజ లక్ష్మీనారాయణుడి ఆలయ ప్రాంగణం

ఉత్సవాలు ఇలా..

- 13వ తేదీన ఉదయం అలంకార తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, చంద్రవాహనసేవ, తిరువీధి ఉత్సవం
- 14న రాత్రి శేషవాహనసేవ
- 15న హనుమంత వాహనసేవ
- 16న గరుడ వాహనసేవ, అనంతరం పటికబెల్లంతో శ్రీ కృష్ణ తులాభారాం
- 17న ఉదయం శ్రీవారికి పూలంగి సేవ, రాత్రి ఎదురు సన్నాహ మహోత్సవము, అనంతరం శ్రీవారి తిరు కల్యాణం
- 18న ఉదయం శ్రీవారికి చందనోత్సవం, రాత్రి రథోత్సవం
- 19న ఉదయం వసంతోత్సవం అనంతరం ధ్రువమూర్తుల తిరుమంజనం, మధ్యాహ్నం మహా పూర్ణాహుతి, రాత్రి ప్రణయ కలహం (ఏడు ముసుగుల ఉత్సవము), దివ్య మంగళ దర్శనం
- 20న ఉదయం సుదర్శన మహాయజ్ఞం, మధ్యాహ్నం తిరుప్పావడై ఉత్సవం, రాత్రి పండిత సత్కారం అనంతరం శ్రీ పుష్ప యాగం నిర్వహించనున్నారు.

ఇక్కడ సుమారు 70 అడుగుల ఎత్తులో ఉన్న గాలిగోపురం నేడు చినగోపురంగా ప్రసిద్ధి చెందినది. శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామి (పెద్దజీయరుస్వామి) విశ్వకళ్యాణముకై ప్రతిష్ఠించిన 108 శ్రీరామ క్రతువు స్తంభాల్లో 85వ స్థంభం 1968లో ఈ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండల పరిధిలో దారితిప్ప 216 జాతీయ రహదారి మలుపు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై వై నాగలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ అంబేద్కర్ జిల్లా అంతర్వేదిలో నివాసం ఉంటున్న రామాని దుర్గా ప్రసాద్ (32) తన అత్తవారి ఇంటికి కలవపూడి వద్ద మోడి గ్రామానికి వెళుతున్నాడు. జాతీయ రహదారి మలుపు వద్ద చేపలలోడు వ్యాన్ దుర్గాప్రసాద్ బైక్‌ను ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దుర్గాప్రసాద్‌కు భార్య జ్యోతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగలక్ష్మి తెలిపారు.


ఘటనా స్థలంలో దుర్గా ప్రసాద్ మృతదేహం

ప్రొటోకాల్‌పై జనసైనికుల ఫైర్

పవన్ కళ్యాణ్‌కు సరైన గౌరవం దక్కడం లేదంటూ ఆవేదన

నరసాపురం రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 164 స్థానాలు గెలుపొందేందుకు ముఖ్య కారకుడైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రొటోకాల్ విషయంలో సరైన గౌరవం దక్కడం లేదంటూ జనసైనికులు ఆవేదన వ్యక్తం చేశారు. నరసాపురం మండలంలోని లిఖితపూడి గ్రామంలో సోమవారం జరిగిన ఇండస్ట్రియల్ పార్కు శంకుస్థాపన కార్యక్రమం వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పవన్ కళ్యాణ్ ఫొటో మంత్రుల ఫొటోలతో సమానంగా వేయడంపై జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడి ఫోటోను ఆ స్థానంలో పెట్టడం కరెక్టుకాదన్నారు. ఆలా చేయడం జనసైనికులందరినీ బాధిస్తుందన్నారు. ఇక మీదట నరసాపురం నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలన్నింటిలో సీఎం చంద్రబాబు ఫొటోతో సమానంగా పవన్ కళ్యాణ్ ఫొటో వేయాలని అధికారులకు సూచించారు.


వివాదానికి దారితీసిన ఫ్లెక్సీలో పవన్ కళ్యాణ్ ఫొటో చిన్నదిగా ఏర్పాటు చేసిన దృశ్యం

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి చెందిన యువతి సోమవారం తెల్లవారుజాము నుంచి అదృశ్యమైనట్లు ఆమె మేనమామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామానికి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను సోమవారం సీజ్ చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. డ్రైవర్, యజమాని, చేపల చెరువు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

విద్యాసంస్థల పేరుతో ఘరానా మోసం

- రూ.70 లక్షలు తీసుకుని నన్ను బురిడీ కొట్టించారు
- సాయి జూనియర్ కళాశాల డైరెక్టర్ సుజాత ఆవేదన


మాట్లాడుతున్న డైరెక్టర్ కోసూరి సుజాత

లింగపాలెం: గంధం సాంబశివరావు అనే వ్యక్తి విద్యా సంస్థలను అప్పజెప్పినట్లుగా చూపి రూ.70 లక్షలు వసూలు చేసి తనను మోసం చేశారని సాయి జూనియర్ కళాశాల డైరెక్టర్ కోసూరి సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం శివారులో బాధితురాలు సుజాత విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే.. బాబా ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో గంధం సాంబశివరావు కాలేజీ నడిపే వారు. ఆ కళాశాలలో సరైన వసతులు లేకపోవడంతో ప్రభుత్వం అనుమతితో ధర్మాజీగూడెం శివారు వలసపల్లి అడ్డరోడ్డులో ఉన్న బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. అమెరికాలో ఉంటున్న తన కుమారుడి వద్దకు తాను వెళ్లిపోతున్నాని, కాలేజీ తీసుకోమని నన్ను అడిగారు. బాబా ఎడ్యుకేషన్ సొసైటీ అనుమతులను సాయి జూనియర్ కళాశాలగా ధర్మాజీగూడెం శివారులో కొత్తగా నిర్మించిన బిల్డింగ్, ఫర్నీచర్‌తో సహ ఐదేళ్ల వాడుకునే విధంగా పెద్దల సమక్షంలో సాంబశివరావుకు రూ.70 లక్షలకు లీజు అగ్రిమెంట్ చేసుకున్నాం. ఏడాదికి రూ.11 లక్షలు అద్దె చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నాం. అగ్రిమెంట్ సమయంలో రూ. 40 లక్షలు సాంబశివరావుకు ఇవ్వగా మిగిలిన రూ. 30 లక్షల నిమిత్తం డిగ్రీ కాలేజీ అనుమతులు వేరే వారికి ఇచ్చి ఆ వచ్చిన సొమ్మును సాంబశివరావుకు చెల్లించాను. కాగా సాంబశివరావు ఇప్పుడు ప్లేట్ ఫిరాయించి వేరే పేర్లతో బినామీగా వనిత జూనియర్ కళాశాల, క్రిసైల్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు అనుమతులు తీసకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తనను మోసం చేసిన గంధం సాంబశివరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు సుజాత తెలిపారు.

గూడెంలో మట్టి అక్రమ తవ్వకాలు

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చేలు, చెరువులు అనే తేడా లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ప్రధానంగా జగన్నాథపురం, మాధవరం, కొమ్ముగూడెం తదితర గ్రామాల్లోని చెరువులను టార్గెట్ చేసుకుని జేసీబీల సాయంతో మట్టి తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ లారీల్లో తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. తద్వారా మట్టి బకాసురులు సొమ్ము చేసుకుంటున్నారు. చేలు, చెరువుల్లో మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించాలంటే సంబంధిత శాఖ అనుమతులు తీసుకోవాలి. అయితే మట్టి బకాసురులు మాత్రం అవేమీ లేకుండానే మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్న వారిని ప్రశ్నిస్తే నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి పేరును ప్రస్తావించడం గమనార్హం. గతంలో కొమ్ముగూడెం గ్రామంలోని చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను స్థానికులు అడ్డుకున్న ఘటనలు ఉన్నాయి. ఇవేమీ పట్టనట్లుగా బకాసురులు తిరిగి యథావిధిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో మట్టి అక్రమ తవ్వకాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు మిన్నకుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


మాధవరం కోతిగుంట చెరువులో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న దృశ్యం

భూవివాదంలో జనసేన శ్రేణులు

స్థానికుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే మందలింపు


కొయ్యలగూడెంలోని భూవివాదంలో స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: భూవివాదంలో జనసేన పార్టీ శ్రేణుల వ్యవహారంపై స్థానికులు ఎమ్మెల్యేని చుట్టుముట్టి తమపై జరిగిన దౌర్జన్యాన్ని వివరించిన ఘటన కొయ్యలగూడెంలో సోమవారం జరిగింది. దీంతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జనసేన శ్రేణులను మందలించడం కనిపించింది. తహసీల్దార్ కే చెల్లన్న దొరతో కలసి కొయ్యలగూడెంలోని వివాదాస్పద భూమి వద్దకు వచ్చిన ఆయన జాతీయ రహదారికి పక్కన ఉన్న కోట్ల రూపాయల విలువైన ఆ భూమి వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలం తమదంటూ బయటి వ్యక్తులు వచ్చారని, వారికి మద్దతుగా జనసేన, టీడీపీ నాయకులు ఉన్నారని స్థానికులు ఎమ్మెల్యేకి వివరించారు. తమ పార్టీలోని కొందరు తనకు తెలియకుండా వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వివాదాస్పద ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ఇబ్బంది కలిగించబోమని ఎమ్మెల్యే చెప్పారు. అదే సమయంలో వివాదానికి సంబంధించిన వ్యక్తుల్లో ఒకరు ఎమ్మెల్యే సమక్షంలో అక్కడే ఉండటం.. అతనిపై మహిళలు దాడికి యత్నించడం గమనార్హం. ఈ క్రమంలో ఎస్సై వి.చంద్రశేఖర్ సిబ్బందితో కలసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

క్లుప్తంగా

చింతామణిదేవికి పంచామృత అభిషేకాలు



విశేష అలంకరణలో చింతామణి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ యోగ ధాన్య మందిరంలో చింతామణి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సమస్త నామార్చనలు ఘనంగా జరిగాయి. నూతన పట్టు వస్త్రాలు అమ్మవారికి సమర్పించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్య నియమాలను పాటించాలి



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరు ఆరోగ్య నియమాలు పాటించాలని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. యాగర్లపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 19,20 వార్డులలో సోమవారం ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన, ఇంటింటి సర్వేలు, ర్యాలీలు జరిగాయి. వక్తలు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్య భద్రత సాధించవచ్చునని చెప్పారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, వారానికి ఒక్కసారి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. దోమ పుట్టకూడదని, దోమ లార్వాలను ఆ దశలోనే అరికట్టాలని తెలిపారు. ఆరోగ్య కార్యదర్శులు వెంకట లక్ష్మి, ప్రశాంతి, ఆశాలు పద్మ, లక్ష్మి, దుర్గ, భవాని, ఆరోగ్య సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలను వినియోగించుకోవాలి



దివ్యాంగుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవోలు హనుమ, జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: భవిత కేంద్రం సేవలను దివ్యాంగులు వినియోగించుకోవాలని ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే.జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ప్రత్యేక అవసరాల పిల్లల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి జూన్ 9వ తేది వరకు ప్రతి ఇంటికి సర్వే నిర్వహించి బడి వయస్సు ఉన్న పిల్లల్ని, బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తిస్తామన్నారు. తద్వారా పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించి సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగుల పిల్లలకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం. చంద్రకుమారి, ఎస్కే. బాల ఈశ్వరయ్య, సీఆర్‌పీలు నాని బాబు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం



ఏలూరులో కవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ అక్షరతేజం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం పాకిస్తాన్‌తో జరుగుతున్న సమరాన్ని పురస్కరించుకొని పాకిస్తాన్‌ను హెచ్చరిస్తూ రాసి, చదివి వినిపించిన కవితకు అనూహ్య స్పందన లభించినట్లు ప్రసాద్ తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరిభూషణం, సారిపల్లి హారిక, విజయలక్ష్మి, కె.రమావతి చేతుల మీదుగా పురస్కారం, జ్ఞాపిక, ప్రసంశాపత్రం అందుకున్నట్లు వివరించారు.

గోదావరికి పంచ హారతులు

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవా రం వశిష్ట గోదావరికి పంచహారతులు ఇచ్చా రు. సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో సోమవారం రాత్రి కలగభద్రుడు స్వామి అర్చకత్వంలో ఏక ముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్ష త్ర, పూర్ణ కుంభ, సర్ప హారాతులిచ్చారు. తొలుత గంగా పూజలు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, మహిళలు, పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- విలవిల్లాడుతున్న ప్రజానీకం
- నిర్మానుష్యంగా రహదారులు
- వ్యాపారాలు లేక చిరు వ్యాపారుల ఇబ్బందులు
- 38 డ్రిగీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు



తణుకు వేల్పూరు రోడ్డులో వేసవి గాల్పునకు రాకపోకలు తగ్గిన దృశ్యం

తణుకు అర్బన్: వేసవి వడగాల్పులు మొదలు కావడంతో ప్రజానీకం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. భగభగలాడుతున్న భానుడి ప్రతాపానికి ప్రయాణికులు తమ ప్రయాణాల్లో విలవిల్లాడుతున్నారు. గత రెండురోజులుగా వడగాల్పులు ప్రారంభం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే వేడి వాతావరణం మొదలవుతుండడంతో వ్యాపార, ఉద్యోగపరంగా బయటకు వచ్చే ప్రజానీకం తమ ప్రయాణాల్లో నీడచాటుకు చేరుకుని కూలబడిపోతున్నారు. ఈ వేసవిలో ఇప్పటి వరకు లేని విధంగా సోమవారం ఏకంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రహదారులపైనే కాకుండా ఇళ్లలోనే ఉండలేకపోతున్నామంటూ ఆందోళన చెందుతున్నారు. రాబోయే రోజుల్లోను, రోహిణీ కార్తెలోను గాల్పుల తీవ్రత మరే స్థాయిలో ఉంటుందోనని భయపడుతున్నారు.

తగ్గుతున్న జనసంచారం

వడగాల్పులు ప్రారంభం కావడంతో పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ర హదారుల్లో జనసంచారం తగ్గిపోతోంది. ఉదయం 10 గంటలలోపే తమ పనులు ముగించుకుని ఇంటికి చేరుతుండడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వ్యాపార, ఉద్యోగ, ఇతర పనుల నిమిత్తం తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చే వారు మాత్రమే రహదారుల్లో ప్రయాణాలు చేస్తుండడంతో రహదారులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, సొసైటీ రోడ్డు, ఆర్వోబీ, రైల్వే స్టేషన్ రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డుల్లో జనసంచారం కనిపించని పరిస్థితి ఎదురైంది. రహదారులపై జనసంచారం తగ్గిపోవడంతో వ్యాపారులు తమ వ్యాపారాలు జరగక కుంగిపోతున్నారు. రహదారులను ఆనుకుని నిర్వహించే చిరు వ్యాపారులు ప్రస్తుత పరిస్థితుల్లో అల్లాడిపోతున్నారు. కొన్ని వ్యాపారాల్లో ఒక్కో రోజు కనీసం బోణీ కూడా కావడంలేదని వాపోతున్నారు. శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, చెరకు రసాలు, బటర్‌మిల్క్, లస్సీ, కిళ్లీ దుకాణాలు మాత్రమే రద్దీగా నడుస్తున్న పరిస్థితి తణుకులో కనిపిస్తోంది.



తణుకులో వేసవి వేడి గాలులకు నిర్మానుష్యంగా మారిన ఆర్వోబీ ప్రాంతం



తణుకు రాష్ట్రపతి రోడ్డులో తగ్గిన జనసంచారం

నర్సుల సేవలు అజరామరం



ప్రపంచ నర్సుల దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అరుణ

తణుకు అర్బన్: వైద్యరంగంలో నర్సులు అందజేస్తున్న అత్యున్నత సేవలు అజరామరమని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. సిస్టర్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని సోమవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో స్థానిక ఎస్ఎం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ అనారోగ్యాలు, ప్రమాదాల బారినపడి ఆస్పత్రులకు వచ్చే రోగులు, క్షతగాత్రులకు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఒక నర్సుగా తన జీవితాన్ని వైద్యవృత్తికి అంకితంచేసిన నైటింగేల్‌ను నర్సింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నర్సు వృత్తిలో ఆమె అందించిన సేవ లను విద్యార్థులు ఆచరించాలని స్పష్టం చేశారు. ముందుగా నైటింగేల్ చిత్రపటానికి డాక్టర్ అరుణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని నర్సులను ఘనంగా సత్కరించారు. ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ కృపావరం, ఆర్ఎంవో డాక్టర్ సాయిబాలాజీ, వైద్యులు, నర్సులు, ఎస్ఎం నర్సింగ్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



తణుకులో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

తణుకు అర్బన్: విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1) (సి) ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తణుకులో సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలైన తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని, ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు లాభాలలో సగం వాటా ఇవ్వాలని, ప్రభుత్వ విద్యారంగం రోజు రోజుకు నిర్వీర్యం అవుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని ఆయా పాఠశాలలను తిరిగి పునఃప్రారంభించాలని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చిలకా నాగరాజు, ఏపీఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు సీహెచ్ అరవింద్, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళి, ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్ల సురేష్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు న్యాయవాది కౌరు వెంకటేశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, న్యాయవాదులు అనుకుల రమేష్, కోలా దుర్గ భవాని, దనాల అప్పారావు, యు మురళి, పి. వివేక్, గంట పవన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసులు ఇస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

తణుకు అర్బన్: మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 20న సమ్మె చేపడుతున్నట్టు ఏఐటీయూసీ నాయకులు బొద్దాని నాగరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ తెలిపారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్‌కు సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలోసమస్యలతో కూడిన సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు గత 20 సంవత్సరాలుగా విధుల్లో పనిచేస్తున్నప్పటికీ నేటికీ పర్మినెంట్ చేయకపోవడం అన్యాయమని, ఇప్పటి వరకు కార్మికులు, ఉద్యోగులకు రక్షణగా ఉన్న ఆప్కాస్ నేటి ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. మునిసిపల్ కార్మికులు కాళ్ల కడిగి పాలకులు నెత్తిమీద జల్లుకోవడం వలన ఎలాంటి ప్రయోజనం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు, సౌకర్యాలు పెంచాలని డిమాండ్ చేశారు. పాత కార్మిక చట్టాల ప్రకారం కొద్దో గొప్పో జీవనం సాగిస్తున్నారని, లేబర్ కోడ్స్ వలన అన్ని హక్కులు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు గార రంగారావు, వి. రమేష్, జి. వెంకటేశ్వరావు, నూకరాజు, ఆంజనేయులు, రవి కుమార్, శ్రీనివాస్, రాములమ్మ, దుర్గారావు, బొద్దాని మురళి, నాగరాజు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ఈ నెల 20వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నందున, కార్మికలోకం సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న లేబర్ కోడ్లు రద్దు చేయాలని, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తుందని, కార్మిక వర్గాన్ని మరింత బానిసలుగా మార్చాలని, చట్టాలను మారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల జన్మహక్కు సమ్మె అన్నారు. తట్టాగొట్టి పెద్దిరాజు, కాయల ప్రసాద్, సారికి శ్రీను, పుట్టా యేసు, మద్దూరి ఆనంద్‌రావు, బాసింశెట్టి శ్రీను, సువ్వాడ రాంపండు, సుంకర శ్రీను, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

బుద్ధుడి జీవితం ఆదర్శనీయం



బుద్ధుని వేషధారణలో కోపల్లె శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): బుద్ధుడి జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం జరిగింది. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే పంచతంత్ర కథలు చెప్పారు. వి.జనార్దనరావుచే పొడుపు కథలు, కథలు పుస్తకాలు చదివించారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా కోపల్లె శ్రీనివాస్‌చే బుద్ధుని వేషధారణ గావించారు. బుద్ధుడు జీవిత విశేషాలను వెల్లడించారు. జి.బాపయ్య శర్మచే విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ విషయాలను అవగాహన కల్పించారు. ఆర్.నాగేంద్రకుమార్‌చే ఇంగ్లీషు గ్రామర్ చెప్పారు. విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, మిఠాయిలు అందజేశారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణకు మరింత మంది విద్యార్థులు హాజరుకావాలని వివరించారు.

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే పులపర్తి, ఎమ్మెల్సీ కవురు



మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, చిత్రంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

భీమవరం అర్బన్: పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. పలు శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన పనుల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారాక అధికారులు కూడా మారతారని, అధికారులు గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధర్, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, ఆరేటి వెంకట సత్య వీరాస్వామినాయుడు, జుత్తిగ కనకదుర్గా వరప్రసాద్, ఎంపీటీసీ తిరుమాని తులసీరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదకాపవరానికి రెండు రంగ స్థల పురస్కారాలు

ఆకివీడు: రంగస్థలంపై రామాంజనేయ యుద్ధం నాటకంలో ఆంజనేయ పాత్రకు పాడిన పద్యానికి రంగస్థల సీనియర్ నటుడు గాదిరాజు చిన అప్పలరాజు, మాతృదేవోభవపై కవితా గానం వినిపించిన గాది రాజు హేమ లక్ష్మీనారాయణరాజుకు ప్రత్యేక అవా ర్డులు ప్రదానం చేసి సత్కరించారు. శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఏలూరులో ఆదివారం నిర్వహించిన ప్రపంచ రంగస్థల, తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకళా వేదిక నిర్వహించిన నాన్ స్టాప్ కళా ప్రదర్శనలో 48 గంటల పాటు అప్పలరాజు రామాంజనేయ యుద్ధంలో పాడిన ఆంజనేయ పాత్ర పద్యం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం కళాకారులిద్దరిని ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్‌రికార్డ్సు పురస్కారం, తానా బుక్ ఆఫ్‌రికార్డ్సు పురస్కారం, కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డులలో అవార్డుల అర్హతకు పేర్లను ఎంపిక చేసి పంపించారని తెలిపారు.

నేడు హోంమంత్రి తణుకు రాక

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలో మంగళవారం రూ. 4.09 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపన కార్యక్రమాలకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు హాజరుకానున్నట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి తణుకు నియోజకవర్గంలో తణుకు మునిసిపాలిటీ, పాలూరు, అత్తిలి, కేఎస్ గట్టు, వేల్పూరు, కె.ఇల్లిందప్రర్రు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

రావిపాడులో వెంకన్నకు పుష్పయాగోత్సవం

పెంటపాడు: మండలంలో మూడు రోజుల నుంచి రావిపాడు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణ ఉత్సవాలు సోమవారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం సుప్రభాతసేవ, అర్చన, పూర్ణాహుతి, బలిహర, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ఉంజల్‌సేవ (పుష్పయాగోత్సవం) ఘనంగా నిర్వహించారు.

మీనవిల్లూరులో నేడు కంటి వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలో మీనవిల్లూరు రామకృష్ణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు పాస్టర్ డీఆర్కే మోజస్ (డీవీ కృష్ణ) ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి, రామకృష్ణ లయన్స్ కంటి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. కంటి లోపాలు ఉన్న వారిని గుర్తించడంతో పాటు, అవసరమైనవారికి శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. ఈ సేవాకార్యక్రమాలు ప్రతీ నెలా రెండవ మంగళవారం నిరాటంకంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుగర్, బీపీ ఉన్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

భీమవరం: స్థానిక నరసయ్య అగ్రహారంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్, డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం మున్సిపాలిటీ 5వ వార్డు కుముదవల్లి రోడ్డులో ఆర్టీసీ డిపో అవుట్ గేట్ నుంచి సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రత్తిపాడు శివాలయానికి విరాళం



శివాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రతిమాంబసమేత సదాశివ స్వామి ఆలయం నిర్మాణానికి సంబంధించిన దాతలు సోమవారం రూ.1,00,116 నగదు అందజేసారు. కాగులంపాడుకు చెందిన అన్నదమ్ములు నూనె రామకృష్ణ, నూనె బులివీరాస్వామిలు కలిసి ఆలయనిర్మాణానికి ఈనగదును అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల కృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మకు వందనం

వీరవాసరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ టి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ తల్లి మీద, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని వివరించారు. చక్కగా చదువుతూ క్రమ శిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పిల్లలచే తల్లుల పాదాలకు నమస్కారం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సన్ కె కోమలి కాలుష్యంపై అవగాహన కల్పించారు. నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని అధిగమించాలంటే చెట్లే ప్రత్యామ్నాయని, పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, వి లక్ష్మణరావు, పి వెంకటేశ్వరరావు, ఆర్ దానకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా వెంకన్న రథయాత్ర



స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కాళ్ల: కాళ్లకూరు గ్రామం గోవింద నామంతో మారుమోగింది. గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథయాత్ర శోభాయమానంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ పలు మేళ తాళాలతో సుందరంగా అలంకరించిన రథంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవంలో ఏర్పాటు చేసిన బుట్ట బొమ్మలు, శక్తి వేషాలు, తీన్మార్ డప్పులు, మేళతాళాలు, డీజే సిస్టం భక్తులను విశేషంగా ఆకర్షించాయి. రథోత్సవం సందర్భంగా జువ్వలపాలెం రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు కాళ్ల పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. రథోత్సవంలో దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

భీమవరం: పట్టణంలోని ఉండి రోడ్డు రైల్వే గేటు వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పట్నాల సీతారాం బాబును సోమవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎక్సైజ్ ఎస్ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరు మద్యం సీసాల స్వాధీనం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముద్దే శ్రీనును అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీపాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వి.కరుణ ప్రియ, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమ మద్యం, సారా కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాలను ఈ నెల 17వ తేదీన ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు సీఐ చెప్పారు.